
కొండమల్లేపల్లి మండలం ఏపూర్‌తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

# దేవరకొండలో కాంగ్రెస్‌కు భారీ షాక్

- మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన 620 కుటుంబాలు

దేవరకొండ, నవంబర్ 3 : దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. వివిధ మండలాలకు చెందిన 620 కుటుంబాలు శుక్రవారం మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాయి. దేవరకొండ పట్టణంలోని సాయి శివ ఫంక్షన్‌హాల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం అనంతరం కొండమల్లేపల్లి మండలం ఏపూర్ తండాకు చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి, ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. మన సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు.

### డిండి మండలంలో..

డిండి మండలంలోని దాసరి నెమలిపురం గ్రామానికి చెందిన 20 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే రవీంద్రకుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన కర్నాటిపల్లి సర్పంచ్

దేవరకొంమడ రూరల్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు మాయ మాటలతో రెండు రోజుల క్రితం ఆపార్టీలో చేరిన కర్ణాటిపల్లి సర్పంచ్ ఆంగోతు పరమేశ్ శుక్రవారం తిరిగి సొంత గూటికి చేరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. దేవరకొండ మండలంలోని దుబ్బాతండాకు చెందిన మరో 250 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. వడ్త్యతండాకు చెందిన 100 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి.

### చింతపల్లి మండలంలో..

చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్ గ్రామానికి చెందిన 100 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### నేరేడుగొమ్ము మండలంలో..

చందంపేట : నేరేడుగొమ్ము మండలంలోని కాచరాజ్‌పల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కేతావత్ బిల్యానాయక్, నాయిని సుధీర్‌రెడ్డి, ఎంపీపీ బాణావత్ పద్మాహన్మనాయక్, జడ్పీటీసీ కేతావత్ బాలూనాయక్, పార్టీ మండలాధ్యక్షుడు లోకసాని తిరుపతయ్య, సర్పంచ్ వాంకుణావత్ నాగునాయక్, వడ్త్య బాలు, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు ఓటేసి సంక్షేమాన్ని కొనసాగించాలి

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్
- నేరేడుగొమ్మ మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

నేరేడుగొమ్ము(చందందంపేట), నవంబర్ 3 : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు మరో మారు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ దేవరకొండ అభ్యర్థి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం, పలుగు తండా, జోడుబాయితండా, చర్లతండా, పందిరి గుండుతండా, ధర్మరేఖ్యాతండాలో కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య పాలనలో పూర్తి స్థాయిలో దెబ్బతిన్న తెలంగాణ రైతును రాజుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతుల సంక్షేమానికి రైతుబంధు, రైతుబీమా, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు. రాష్ట్రంలో గురుకులాలను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనంతో పాటు ఇటీవలే సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని సైతం ప్రారంభించారన్నారు. పల్లె ప్రగతితోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయని, సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, కొత్త గ్రామపంచాయతీ భవనాలు ఇలా అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. సీఎం కేసీఆర్ కృషితోనే పల్లెలు అభివృద్ధిలో పయనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యేగా తనను మరోమారు ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సుధీర్‌రెడ్డి, ఎంపీపీ పద్మాహన్మనాయక్, జడ్పీటీసీ బాలూనాయక్, సర్పంచ్ కేశవులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లోకసాని తిరుపతయ్య, వైస్ ఎంపీపీ ఆకరెంటి ముత్యాలమ్మారాములు, నాయకులు పల్స వెంకటయ్య, బైరెడ్డి కొండల్‌రెడ్డి, చిన్నానాయక్, రవీందర్‌నాయక్, కుంభం నరేశ్, మధు, కోఆప్షన్ సభ్యుడు పాషా పాల్గొన్నారు.

## ఆవు దాడిలో మహిళ మృతి

కొండమల్లేపల్లి, నవంబర్ 3 : మండంలోని వడ్త్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్‌తండాకు చెందిన నేనావత్ అంజలి(52)ని శుక్రవారం ఆవు పొడవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజలి పశువులను మేత కోసం పొలానికి తీసుకెళ్లింది. మధ్యాహ్న సమయంలో మందలోని ఆవు దూడను పట్టుకోగా వెనక నుంచి వచ్చిన ఆవు కొమ్ములతో ఆమెను బలంగా పొడవగా ఆమె కింద పడిపోయింది. దాంతో ఆవు ఆమెను తొక్కడంతో అంజలి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. అంజలి భర్త మాన్యనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

## ‘ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి’

కొండమల్లేపల్లి, నవంబర్ 3: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ పరిశీలకులు అడేపు నాగర్జున మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్ గడ్డం శ్రీరాములు, పోతం సహదేవులు మాదిగ, మారుపాక గోపాల్ మాదిగ, అందుగుల తిరుపతయ్య, ఎదుళ్ల ఎల్లయ్య, వస్కుల కృష్ణయ్య, లింగం, వస్కుల విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు

## నోముల భగత్ గెలుపొందాలని పూజలు

త్రిపురారం, నవంబర్ 3: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ మరోమారు గెలుపొందాలని ఆ కాంక్షిస్తూ గిరిజన సంఘం నాయకులు శుక్రవారం దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలోని బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ బాబూరావునాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు కెతావత్ భిక్షానాయక్, పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్, సర్పంచులు హన్మంతునాయక్, జయరాంనాయక్, మల్లిఖార్జున్‌నాయక్, చంద్రమౌలినాయక్ పాల్గొన్నారు.

# నోముల భగత్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి


జి. అన్నారం గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న నోముల లక్ష్మి

- నోముల లక్ష్మి

త్రిపురారం, నవంబర్ 3 : రాబోయే ఎన్నికల్లో మహిళలంతా కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే నోముల భగత్‌ను మరోమారు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని భగత్ తల్లి నోముల లక్ష్మి కోరారు. మండలంలోని జి.అన్నారం గ్రామంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి పథకాన్ని మహిళల పేరుతో అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. మహిళలంతా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గగ్గనపల్లి వనజ, మహిళా అధ్యక్షురాలు కళావతి, పద్మ, అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

పెద్దఅడిశర్లపల్లి నవంబర్ 3 : దేవరకొండ సాయి రమ్య ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రకుమార్ హాజరు కానున్నారని, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

## వరికోత యంత్రం బోల్తా.. డ్రైవర్ మృతి

గుర్రంపోడు, నవంబర్ 3 : మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామ సమీపంలో గురువారం రాత్రి వరికోత యంత్రం బోల్తా పడగా.. డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తమినాడు రాష్ట్రానికి చెందిన తెన్నరసు(30) తన వరికోత యంత్రంతో 10 రోజుల క్రితం గుర్రంపోడు మండలానికి వచ్చాడు. స్థానికంగా ఉంటూ వరి కోతలు చేపడుతున్నాడు. గురువారం రాత్రి జిన్నాయిచింత గ్రామంలో రైతు పొలం కోసి తిరిగి మండల కేంద్రానికి వస్తుండగా.. వద్దిరెడ్డిగూడెం గ్రామ సమీపంలో యంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. దాంతో తెన్నరసు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పీహెచ్‌సీల్లో అన్ని చికిత్సలు అందించాలి

- జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ రూరల్, నవంబర్ 3 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు విధిగా అన్ని రకాల చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని డాక్టర్లు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ పెషంట్లకు విధిగా ఎక్స్‌రే, స్కూటమ్, ఏఆర్‌టీ చేయాలన్నారు. టీబీ టెస్టులు పెంచాలన్నారు. గర్భిణులు, చిన్నారుల ఎదుగుదల కోసం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాలన్నారు. సాధారణ ఎన్నికల్లో కొవిడ్ పేషంట్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉందన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కొండల్‌రావు, డాక్టర్ లచ్చు, మాతృ, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- డీఎస్ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ రూరల్, నవంబర్ 3 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని కంచనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, ఆర్ఐ స్వామి, సెంటర్ ఇన్‌చార్జి బట్టు నవీన్, రైతులు పాల్గొన్నారు .